నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 8 మార్చి 2025 | SANGAREDDY

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- గీతం ఇండస్ట్రీ కాంక్లేవ్‌లో అతిథులు

మాట్లాడుతున్న ప్రముఖ పరిశ్రమల నాయకులు, నిపుణులు

పటాన్‌చెరు, మార్చి 7: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని కెరీర్ గైడెన్స్ సెంటర్ (సీజీసీ) గీతం ఇండస్ట్రీ కాంక్లేవ్ - 2.0ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు, యువ నిపుణులు ఒకచోట కలుసుకున్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య మరింత చేరువై నైపుణ్యాలు కలిగిన యువతను అందుబాటులోకి తేవడానికి ఈ కాంక్లేవ్ నిర్వహించారు. కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉన్నతాధికారి కె. విజయ్‌దత్, ఎట్ నెక్స్ట్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో సీహెచ్ నెహ్రూ బాబు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రతినిధులు, నిపుణులతో మూడు ప్యానల్ చర్చలు జరిగాయి.

గజ్వేల్‌లో ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని బాధితులతో కలిసి ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నిర్వాసితులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పంటలు ఎండుతున్నయ్

- సిద్దిపేట రూరల్ మండలంలో పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మార్చి 7: ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పంటలకు నీరు అందించకపోవడంతోనే ఎండుతున్నాయని మాజీ ఎంపీపీ శ్రీదేవీచందర్‌రావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ లక్కవరసు ప్రభాకర్ వర్మ, సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భూమయ్యగారి కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలంలో రైతు పరామర్శ కార్యక్రమాన్ని చేపట్టారు. సీతారాంపల్లి, అంకంపేట గ్రామాల్లో పర్యటించి నీళ్లు అందక ఎండిపోయిన పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో పంటలకు పూర్తి స్థాయిలో నీరు అందించి, ఎక్కడా ఎండిపోకుండా కాపాడిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం సరైన సమయంలో నీళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించి రైతులను నట్టేట ముంచిందన్నారు. పొలాలు నెర్రెలు బారుతుంటే రైతులకు దుఃఖం వస్తున్న పరిస్థితి ఉందన్నారు. సరైన ప్రణాళిక లేక నీటిపారుదల శాఖ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒకచోట రైతులు నీళ్ల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ అధికారులతో సమీక్ష జరిపి ఎండిపోయిన పంట పొలాల రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో మరో రైతు పోరాటానికి సిద్ధం కావాల్సి ఉంటుందని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మాజీ సర్పంచ్‌లు తవిటి ఉదయశ్రీ తిరుపతి, హంసకేతన్ రెడ్డి, దశరథం, తిరుపతి, నాయకులు పడిగే ప్రశాంత్ ముదిరాజ్, రాజశేఖర్, రాజశేఖర్ రెడ్డి, గజ్జల సంతోష్, దార మొగిలి, చెన్నారెడ్డి, భగవాన్ రెడ్డి, పడిగే నర్సయ్య, పడిగే కనకయ్య, గజ్జల జయంత్, శంకర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట రూరల్ మండలంలో ఎండిన పొలాలను శుక్రవారం పరిశీస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఉగాది, రంజాన్ తరువాత నిరాహార దీక్షలు
- ముంపు గ్రామాల పక్షాన పోరాటం తప్పదు
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 7: మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలతో పాటు గజ్వేల్ పట్టణంలోని ఇండ్లులేని నిరుపేదల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విఫలమైందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మల్లన్నసాగర్ ముంపు బాధితులు, గజ్వేల్ పట్టణంలోని ఇండ్లులేని పేదలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శ్మశాన వాటిక, కబ్రస్థాన్ నిర్మాణం, గజ్వేల్ పట్టణానికి చెందిన అర్హులు 1156 మంది పేదలకు వెంటనే ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న కొండపోచమ్మ సాగర్ బాధితులకు ప్యాకేజీ, ఓపెన్ ప్లాట్లను తక్షణమే అందించాలన్నారు. హైకోర్టు ఆదేశాలమేరకు ఒంటరి మహిళలకు ప్రత్యేక ప్యాకేజీ, ఇండ్ల స్థలాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు 90శాతం పనులు పూర్తిచేయగా, మిగతా 10శాతం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయక చేతులెత్తేసిందని విమర్శించారు. ప్యాకేజీ కింద వెంటనే రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే రంజాన్, ఉగాది పండుగల తర్వాత వేలాది మందితో రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి వందలాది ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళిగుప్తా, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ కౌన్సిలర్లు మెట్టయ్య, గోపాల్‌రెడ్డి, గుంటకు రాజు, చందు , కనకయ్య, రవీందర్, పంబాల శివ, శ్రీధర్, అత్తెల్లి శ్రీనివాస్, అల్వాల బాలేశ్, హైదర్ పటేల్, అహ్మద్, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఆర్డీవో చంద్రకళకు వినతి పత్రం అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

జేఏసీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

కాంగ్రెస్‌ను తిట్టాడని వీడియో చక్కర్లు

- ఫ్యాబ్రికేషన్ చేసిన వీడియో అన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో రాజుకున్న వేడి

పటాన్‌చెరు, మార్చి 7: కాంగ్రెస్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తిట్టాడని షోషల్ మీడియాలో వీడియో చక్కర్లు కొడుతుంది. దీంతో కాంగ్రెస్‌లో వేడి రాజుకుంది. ఇటీవల ప్యారానగర్ డంప్‌యార్డు వద్దంటూ జేఏసీ నాయకులు క్యాంప్ ఆఫీసులో పటాన్‌చెరు ఎమ్మెల్యేను కలిసి ప్యారానగర్ డంప్‌యార్డును నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నెల రోజుల తర్వాత గుర్తుకు వచ్చానా.? అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అధిష్టానానికి మీరు చెబితే డంప్‌యార్డు ఆగుతుందని పలువురు చెప్పడంతో ఆగ్రహంతో ఎమ్మెల్యే కాంగ్రెస్‌పై అనుచిత పదజాలం వాడినట్లుగా ప్రచారం అవుతున్నది. దూరం నుంచి తీసిన ఒక వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే వీడియో వార్తను ఖండించారు. ఫ్యాబ్రికేటెడ్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. డంప్‌యార్డుపై ఏర్పడిన జేఏసీ నాయకులు తనను కలిసిన మాట వాస్తవం అన్నారు. వారికి, గుమ్మడిదల ప్రజలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. నేను వారి ఎదుట కాంగ్రెస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లుగా సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో ప్రచారం చేయడం పై ఆయన మండిపడ్డారు.

ఎమ్మెల్యే పేరున విడుదల చేసిన వార్త పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్‌లో కార్చిచ్చు రగిల్చింది. పార్టీలోని మరోవర్గం దానిని విస్తృతంగా వైరల్ చేస్తున్నది. ఇప్పటికే పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకుల వరకు ఈ విషయం వెళ్లినట్లు ప్రచారం అవుతున్నది. ఈ వివాదం మరింత రాజుకునేలా ఉంది.

ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

అమీన్‌పూర్ మార్చి 7: కాంగ్రెస్‌లోనే ఉంటూ పార్టీపై ఎమ్మెల్యే గూడెం అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీని భ్రష్టు పట్టించాలనే దురాలోచన మానుకోవాలన్నారు. పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నష్టం చేకూర్చేలా వ్యవహరించడం సరైందికాదన్నారు. పార్టీలో ఉండడం ఇష్టం లేకపోతే స్వచ్ఛందంగా వచ్చి నడారిలోనే వెళ్లాలని సూచించారు. కానీ, ఇదే పార్టీలో ఉంటూ అధికారాన్ని అనుభవిస్తూ పార్టీకి నష్టం కలిగిస్తే మాత్రం చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పదేండ్లు కష్టనష్టాలు భరించి పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేశామని, అలాంటిది ఓ పార్టీలో గెలిచి అధికారం అనుభవించేందుకు కాంగ్రెస్‌లో చేరి పార్టీని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్యారానగర్ డంప్‌యార్డు సమస్య పరిష్కారం కోసం వచ్చిన జేఏసీ సభ్యులను కించపర్చడమే కాకుండా పార్టీని సైతం హేళనచేయడం అక్కడున్న వారందరూ స్వయంగా విన్నారని, అలాంటిది ఈ విషయం ఎవరో వక్రీకరించారని అబద్ధాలు మాట్లాడడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. అనుచిత వ్యాఖ్యలపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి, చంద్రారెడ్డి, సుధాకర్ గౌడ్, శశిధర్ రెడ్డి, నర్సింగరావు, సుధాకర్ యాదవ్, వడ్డే కృష్ణ, జైపాల్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దళితబంధు ఇచ్చేవరకు పోరాటం

- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్ ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 7: దళితబంధు నిధులు విడుదల చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదలమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో దళితబంధు పథకం మంజూరైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇవ్వాలనే డిమాండ్‌తో శుక్రవారం నారాయణఖేడ్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. దళితులు పూర్తిస్థాయిలో అభ్యున్నతి సాధించాలనే ఉద్దేశంతో కేసీఆర్ దళిత బంధు పథకాన్ని అమలు చేసి తొలి విడుతగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.3 లక్షలు జమ చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ డబ్బులు విడుదల చేయకుండా అడ్డుకోవడం దారుణమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దళిత డిక్లరేషన్ పేరిట ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా ఒక్కో దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అందజేస్తామని, మూడు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఏటా రూ.750 కోట్ల నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దళితుల విదేశీ విద్య కోసం రూ.20 లక్షలు ఇవ్వగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. దళిత విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం 300 సాంఘిక సంక్షేమ గురుకులాలు ఏర్పాటు చేయగా, 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో దళితుల కోసం ఒక్క విద్యాలయం నెలకొల్పలేదని మండిపడ్డారు. అబద్ధపు హామీలతో దళితుల ఓట్లను దండుకున్న కాంగ్రెస్ పార్టీ , అధికారం చేపట్టిన తర్వాత వంచనకు గురిచేస్తున్నదని విమర్శించారు. 'ఖేడ్' నియోజకవర్గంలో దళితబంధు మంజూరైన 1100 దళిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉండి పోరాటం చేస్తుందని, దళితబంధు నిధులు విడుదలయ్యే వరకు దశల వారీగా పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అంతకుముందు భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. దళిత డిక్లరేషన్ సందర్భంగా ప్రియాంక, రేవంత్ దళితులకిచ్చిన హామీలను ఫోన్‌లో వినిపించారు. ధర్నాలో 'ఖేడ్' బీఆర్ఎస్ నాయకులు పరమేశ్, నగేశ్, రవీందర్‌నాయక్, ఎంఏ నజీబ్, ఆహీర్ పరశురామ్, అభిషేక్ శెట్కార్, విఠల్, చన్‌బసప్ప, సంగప్ప, విశ్వనాథ్, సాల్మన్, ప్రసాద్, విజయ్, రాజునాయక్ పాల్గొన్నారు.

సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ బదిలీ

- యాంటీనార్కోటిక్ బ్యూరో ఎస్పీగా నియామకం
- కొత్త ఎస్పీగా పారితోశ్ పంకజ్
- కొత్తగూడెం ఓఎస్డీ నుంచి సంగారెడ్డి ఎస్పీగా ఉద్యోగోన్నతి
- నేడు బాధ్యతలు స్వీకరించనున్న పారితోశ్ పంకజ్

బదిలీపై వెళ్తున్న ఎస్పీ రూపేష్

నూతన ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి మార్చి 7(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ బదిలీ అయ్యారు. ప్రభుత్వం 21మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్పీ రూపేశ్‌ను హైదరాబాద్‌లోని యాంటీనార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా బదిలీ చేశారు. జిల్లా నూతన ఎస్పీగా పారితోశ్ పంకజ్ నియమితులయ్యారు. కొత్తగూడెం ఓఎస్డీగా ఉన్న పారితోశ్ పంకజ్‌ను సంగారెడ్డి జిల్లా ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించింది ప్రభుత్వం. పారితోశ్ పంకజ్ శనివారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. చెన్నూరి రూపేశ్ అక్టోబర్ 13, 2023 నుంచి సంగారెడ్డి జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. నవంబర్, 2023లో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేశారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలకు జరిగిన జనరల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా జిల్లాలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల అమ్మకం, రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. పోలీసుల భద్రతకు, సంక్షేమానికి ఎస్పీ రూపేశ్ ప్రాధాన్యత ఇచ్చారు.

నేడు నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ

సంగారెడ్డి జిల్లా నూతన ఎస్పీగా శనివారం పారితోశ్ పంకజ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన పారితోశ్ స్వస్థలం బీహారులోని భోజ్‌పురి జిల్లా ఆరానగరం. 2010 నుంచి 2015 వరకు ప్రైవేట్ రంగంలో పనిచేసిన పారితోష్ పంకజ్ 2015లో మర్చంట్ నేవీలో సెకండ్ నావిగేటింగ్ కమాండర్‌గా పనిచేశారు. 2020లో ఐపీఎస్‌గా ఎంపికైన పారితోశ్ శిక్షణ పూర్తయిన తర్వాత గ్రేహౌండ్స్ ఆసాల్ట్ కమాండర్‌గా పని చేశారు. 2023లో భద్రాచలం అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత ఉద్యోగోన్నతిపై 2024లో కొత్తగూడెం జిల్లా ఓఎస్డీగా బాధ్యతలు చేపట్టారు.

మ్యాథ్స్ టీచర్ కర్కశత్వం

- ఆరుగురు విద్యార్థినులకు వాతలు వచ్చేలా కొట్టిన టీచర్
- కంగ్టిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఘటన
- గాయాలు చూసి రోదించిన విద్యార్థినుల తల్లిదండ్రులు
- ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి: పేరెంట్స్

విచక్షణారహితంగా దెబ్బలుతిన్న విద్యార్థినులు

కంగ్టి, మార్చి 7: సంగారెడ్డి జిల్లా కంగ్టిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో మ్యాథ్స్ టీచర్ సురేఖ విద్యార్థినుల పట్ల కర్కశత్వంగా వ్యవహరించారు. రాశి, భువనేశ్వరి, అక్షయ, అశ్విని, సునీత, సోనీ అనే ఆరుగురు విద్యార్థినులను మ్యాథ్స్ టీచర్ సురేఖ చితకబాదడంతో వారికి వాతలు వచ్చాయి. విద్యార్థులు సరిగ్గా చదవకపోతే టీచర్ వారిపై చర్యలు తీసుకోవడం చూస్తుంటాం. కానీ, చెట్లకు నీళ్లు పోయలేదని ఒకరికి, చెప్పిన డ్రెస్ వేసుకోలేదని మరొకరికి, ఇలా పలు కారణాలతో టీచర్ ఆ విద్యార్థినులపై జులుం చూపించింది. టీచర్ కొట్టడంతో విద్యార్థినుల చేతులు, కాళ్లకు వాపులు రావడంతో శుక్రవారం స్థానిక ప్రైవేట్ దవాఖానలో వారికి చికిత్స చేయించారు. ఈ విషయం శుక్రవారం సాయంత్రం వరకు బయటకు రాలేదు. తీరా సాయంత్రం బయటకు రావడంతో వారి తల్లిదండ్రులకు విషయం తెలిసింది. తల్లిదండ్రులు పాఠశాల చేరుకుని విద్యార్థినులకు గాయాలను చూసి పాఠశాల వద్ద రోదించారు. జీవనోపాధి కోసం తాము హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నామని, ఈరోజు తాము గ్రామానికి వచ్చామని, దీంతో ఈ విషయం తెలిసిందని ఓ విద్యార్థిని తల్లిదండ్రులు వాపోయారు. పూలమొక్కలకు నీళ్లు పోసేందుకు నిరాకరించినందుకే సురేఖ టీచర్ తమ కూతురు రాశిపై దౌర్జన్యంగా కొట్టిందని వారు ఆరోపించారు. సురేఖ టీచర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై ఎంఈవో రహీముద్దీన్‌ను వివరణ కోరగా.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ఆయన తెలిపారు. బాలికలను విచక్షణారహితంగా కొట్టిన ఉపాధ్యాయురాలు సురేఖపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పై కెమెరా పెట్టి.. వీడియోలు చిత్రీకరించి..

- కిష్టారెడ్డిపేట్‌లోని లేడీస్ హాస్టల్‌లో దారుణం
- గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థినులు
- యజమానిపై కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు

అమీన్‌పూర్, మార్చి 7: లేడీస్ హాస్టల్‌లో గోప్యంగా స్పై కెమెరా బిగించి వీడియోలు చిత్రీకరిస్తున్న సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేశ్ వివరాల ప్రకారం.. బండారు మహేశ్ అనే వ్యక్తి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట్ మైత్రి విల్లాస్‌లోని విల్లా నెంబర్ 75లో సుమారు 35 మంది విద్యార్థినులతో లేడీస్ హాస్టల్‌ను నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా హాస్టల్‌లో గోప్యంగా స్పై కెమెరాను బిగించి ఫొటోలు చిత్రీకరిస్తున్నట్లు విద్యార్థినులు గమనించారు. ఈ విషయాన్ని అమీన్‌పూర్ పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థినుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి హాస్టల్‌ను సందర్శించి కెమెరాలోని పలు చిప్స్‌లను పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలిపారు. ఈ ఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు, స్థానికులు లేడీస్ హాస్టల్‌లో ఎదుట ఆందోళనకు దిగారు. ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హాస్టల్ గదులను పరిశీలిస్తున్న ఎస్సై సోమేశ్వరి

డంప్‌యార్డును రద్దు చేయకుంటే సమరమే..

- కొత్తపల్లి, నల్లవల్లి, గుమ్మడిదల గ్రామాల్లో 31వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు


గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలు కొనసాగడానికి రైతు జేఏసీ నాయకులకు రూ.20 వేలు విరాళం అందజేస్తున్న మత్స్యకార సొసైటీ సభ్యులు

గుమ్మడిదల, మార్చి 7: డంపింగ్ యార్డు రద్దు చేయకుంటే స్థానిక ఎన్నికలను కూడా బహిష్కరిస్తామని జేఏసీ నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును రద్దు చేయాలంటూ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 31వ రోజుకు చేరుకున్నారు. నల్లవల్లి గ్రామంలో గౌడ సంఘం సభ్యులు దీక్ష చేపట్టారు. దీక్షలు కొనసాగడానికి గౌడ సంఘం సభ్యులు రూ.10 వేల విరాళాన్ని రైతు జేఏసీ నాయకులకు అందజేశారు. కొత్తపల్లిలో గ్రామస్తులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో మత్స్యకార కులస్తులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి రైతు జేఏసీ నాయకులు మద్దుతిచ్చారు. మత్స్యకార సంఘం సభ్యులు దీక్షలు కొనసాగడానికి రూ.20 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. 31 రోజుల నుంచి ఆందోళనలు, నిరసనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, జిల్లా మంత్రి, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం అన్యాయమన్నారు. ప్యారానగర్ డంపింగ్ యార్డు ప్రాంతంలో సర్కారు భూమి కేవలం 37 ఎకరాలు మాత్రమే ఉందని తేల్చి చెప్పారు. ప్యారానగర్‌లో 1-63 సర్వే నంబర్ భూమిలో 722-38 ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో రైతులకు పట్టాలు ఇచ్చింది 436.08 ఎకరాలన్నారు. వివాదాస్పదంగా ఉన్న భూమి 286.23 ఎకరాలు ఉండగా ఆ భూములు ఇప్పటికే రైతుల కబ్జాలో ఉన్నాయన్నారు. మిగిలిన సర్కారు భూమి 37 ఎకరాలు మాత్రమే. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి 152 ఎకరాలు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు రికార్డులు తారుమారు చేసి 152 ఎకరాలు ఉందని తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. డంపింగ్ యార్డు కోసం రికార్డులు తారుమారు చేశారన్నారు. ఈ విషయంపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య, జేఏసీ నాయకులు పుట్ట నర్సింగ్‌రావు, మూడుచింతల నరేందర్‌రెడ్డి, నాగేందర్ గౌడ్, కాలకంటి రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, మంద బలరాంరెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రారెడ్డి, ముద్దంగుల గోపాల్, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్, కరుణాకర్, ఉదయ్ కుమార్, మన్నె రామకృష్ణ, మధు, రాము, మేకల యాదగిరి, బొర్ర శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, సత్తయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

డంప్‌యార్డు రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం

నర్సాపూర్, మార్చి 7: డంపింగ్ యార్డును ప్రభుత్వం రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ నర్సాపూర్ పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ డంపింగ్ య